

తిరుమలలో అపచారం : టీటీడీ మాజీ చైర్మన్ కరుణాకర్ రెడ్డి

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : తిరుమల క్షేత్రంలో మరొక ఘోర అపచారం జరిగిందని టిటిడి మాజీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి విమర్శించారు. పద్మావతిపురంలోని ఆయన నివాసం వద్ద విలేకరులతో బుధవారం మాట్లాడుతూ తిరుమల పవిత్రతను కాపాడతానని చెప్పిన కూటమి నేతలు ఇప్పుడు చేస్తున్నది ఏమిటని ప్రశ్నించారు. నిన్న పాప వినాశనం డ్యాంలో బోటింగ్ జరిగిందన్నారు. పవిత్ర క్షేత్రం పర్యాటక క్షేత్రం కామందని ప్రచారం జరుగుగా, దాని మీద ఎలా వివరణ ఇవ్వాలో అర్థం కాక, ఫారెస్ట్ అధికారులు కేవలం రక్షణ చర్యల్లో భాగమని తెలుపడం హాస్యాస్పదమన్నారు. తిరుమల టిటిడి పరిధిలో డ్యాం ఉంది కనుక ఈవో, అడిషనల్ ఈవో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. సనాతన ధర్మం కాపాడుతానని చెప్పిన పవన్ నంద స్వామి ఎక్కడని ప్రశ్నించారు. ఆయన పరిధిలో ఉన్న అటవీశాఖ ఇలాంటి చర్యలు చేపడుతుంటే మౌనంగా ఉంటూ సనాతన ధర్మం ఎలా కాపాడుతారన్నారు.

వివక్ష వీడాలి.. వేతనాలు పెంచాలి

➤ జీతాలు పెంచాలని, సమస్యలు పరిష్కరించాలని టిటిడి పరిపాలనా భవనం ముందు స్విమ్స్ కార్మికుల ధర్నా

➤ ప్రభుత్వాలు, అధికారులు మారుతున్నా కార్మికుల జీవితాలు మారడం లేదు : సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి

సిఐటియు ఆధ్వర్యంలో టిటిడి ఏడి బిల్డింగ్ వద్ద ధర్నాలో ప్రసంగిస్తున్న కందారపు మురళి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: స్విమ్స్ కార్మికులకు వేతనాలు పెంచాలని, సమస్యలు పరిష్కారం చేయాలని బుధవారం ఉదయం స్విమ్స్ ఆసుపత్రి నుండి కార్మికులు ప్రదర్శనగా టీటీడీ పరిపాలన భవనం వద్దకు చేరుకుని అక్కడ మధ్యాహ్నం వరకు ధర్నా నిర్వహించారు. ధర్నా అనంతరం టీటీడీ జేఈవో వీర బ్రహ్మంకు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ధర్నాను ఉద్దేశించి సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి మాట్లాడుతూ స్విమ్స్ ఆసుపత్రి ఏర్పడినప్పటి నుండి నేటి వరకు పనిచేస్తున్న కార్మికులకు వేతనాలు పెంచడం లేదని, సమస్యలు పరిష్కారం చేయడం లేదన్నారు. ప్రభుత్వాలు మారుతున్నా, అధికారులు మారుతున్నా, కార్మికుల జీవితాలు మాత్రం మారడం లేదన్నారు. గతంలో వార్డు బాయ్‌లుగా పనిచేసిన వారి పేర్లను శానిటేషన్ కార్మికులుగా చేర్చడం దారుణమని విమర్శించారు. వారు శానిటేషన్ కిందకు రావడంతో మిగతా వారితోపాటు జీత భత్యాలు, సౌకర్యాలు రావడం లేదన్నారు. అధికారులు చేసిన తప్పులను అధికారులే సరిదిద్దుకోవాలని హెచ్చరించారు. వీరికి శానిటేషన్ పేరు తీసి వార్డ్ బాయ్‌గా మార్చాలని డిమాండ్ చేశారు. కార్మికులపై అలవిమాలిన పనిభారం వేయడం సమర్థనీయం కాదని, నిర్దిష్టమైన పనిని కేటాయించాలని డిమాండ్ చేశారు. గతంలో మూడుసార్లు స్విమ్స్ డైరెక్టర్ కార్యాలయం ఎదుట ఆందోళనలు నిర్వహించినా, స్వయంగా డైరెక్టర్ చర్చల్లో పాల్గొని సమస్యలపై హామీ ఇచ్చినా ఫలితం రాలేదన్నారు. సమస్యలు పరిష్కారం కాకపోవడంతో టిటిడి పరిపాలన భవనం ముందు నిరసన కార్యక్రమం చేపట్టడం జరిగిందని, టీటీడీ స్విమ్స్ సమస్యలతో కార్మికుల సమస్యలు పరిష్కారం చేయాలని లేని పక్షంలో సమ్మెలోకి వెళతామని హెచ్చరించారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు జి. బాలసుబ్రమణ్యం, సిఐటియు తిరుపతి నగర ప్రధాన కార్యదర్శి కే.వేణుగోపాల్ మాట్లాడుతూ టీటీడీ స్విమ్స్‌లో విలీనమయ్యాక, టీటీడీ స్విమ్స్‌పై, స్విమ్స్ టీటీడీపై ఒకరి ఒకరు దాట వేసుకుంటూ సమస్యను పక్కదారి పట్టిస్తున్నారన్నారు. సమస్యలు పరిష్కారం చేయాలని, లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు పూనుకుంటామని హెచ్చరించారు. ధర్నా అనంతరం జేఈవో వీర బ్రహ్మంకు సిఐటియు బృందం వినతి పత్రం ఇచ్చారు. సానుకూలంగా స్పందించిన జేఈవో పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇవ్వడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు టి.సుబ్రహ్మణ్యం, పి.బుజ్జి, ఆర్.లక్ష్మి పి మునిరాజా, జె.వాసు, స్విమ్స్ కార్మికుల యూనియన్ కార్యదర్శి రవి, అధ్యక్షులు సూరి, కోశాధికారి మారి ముత్తు, నాయకులు గోపి, వేలు, వెంకటేష్, విజయలక్ష్మి, సుబ్రహ్మణ్యం, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ బెట్టింగ్‌పై చర్యలు తీసుకోవాలి

తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: ఆన్‌లైన్ బెట్టింగ్‌పై తక్షణ చర్యలు తీసుకోవాలని వైసీపీ తిరుపతి ఎంపీ డాక్టర్ మద్దిల గురుమూర్తి పార్లమెంట్ జీరో అవర్‌లో కోరారు. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో భాగంగా తిరుపతి ఎంపీ బుధవారం మాట్లాడుతూ ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లతో సమాజంలో ప్రమాదకర పరిస్థితులు తలెత్తుతున్నాయన్నారు. ఈ ప్లాట్‌ఫామ్‌ల ద్వారా త్వరగా డబ్బు సంపాదించాలనే తలంపు చివరికి మోసాలు, దొంగతనాలు, ఇతర అక్రమ కార్యకలాపాలకు ప్రేరేపిస్తున్నాయని సభ దృష్టికి తీసుకెళ్లారు. ప్రభుత్వ నియంత్రణను కూడా అధిగమించి కొత్త పేర్లతో బెట్టింగ్ యాప్‌లు పునరావృతమవుతున్నాయని ఎంపీ గురుమూర్తి ఆందోళన వ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా ప్రజలకు ఆన్‌లైన్ బెట్టింగ్ నష్టాల గురించి అవగాహన కల్పించే ప్రచార కార్యక్రమాలు చేపట్టాలని ఆయన ప్రభుత్వం దృష్టికి తెచ్చారు.

జపాన్ పెట్టుబడులకు ఆంధ్రప్రదేశ్ కీలక గమ్యం

జపాన్ రాయబారులతో శ్రీసిటి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి తదితరులు

ప్రజాశక్తి - వరదయ్యపాలెం: భారతదేశంలోని జపాన్ రాయబారి కార్యాలయం, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, ఆంధ్రప్రదేశ్ ఆర్థికాభివృద్ధి మండలి (ఈ.డి.బి), ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఎఫ్.ఐ.సి.సి.ఐ) సంయుక్తంగా, "పెట్టుబడులు, మౌలిక సదుపాయాలు, ప్రజా సంబంధాలు అండ్ విద్య" అంశాలపై నిర్వహించిన సెమినార్ బుధవారం విజయవాడలోని నోవాటెల్ హోటల్‌లో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమం జపాన్-ఆంధ్రప్రదేశ్ మధ్య ఆర్థిక, సాంస్కృతిక సంబంధాలను మరింత బలోపేతం చేయడానికి వేదికగా నిలిచింది. ఈ సదస్సులో భారతదేశంలో జపాన్ రాయబారి ఓనో కెయిచీ, ఆంధ్రప్రదేశ్ పరిశ్రమలు. వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి. భరత్, శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డా. రవీంద్ర సన్నారెడ్డి, పాల్గొన్నారు. ఎఫ్.ఐ.సి.సి.ఐ డిప్యూటీ సెక్రటరీ జనరల్ డా. గుణవీనా చద్దా సమన్వయం చేయగా, విశ్వ సముద్ర హెూల్డింగ్స్ మేనుఫ్యాక్చరింగ్ సి.ఈ.ఓ జితేంద్ర నిమ్మగడ్డ అతిథులకు స్వాగతం పలికారు. జపాన్ రాయబారి ఓనో కెయిచీ, భారతదేశంతో జపాన్ వ్యాపార సంబంధాలను ప్రోత్సహించడంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను ప్రశంసించారు. జపాన్-ఆంధ్రప్రదేశ్ మధ్య పెట్టుబడుల విస్తరణ, ప్రజల మధ్య సంబంధాల అభివృద్ధి, విద్య, మౌలిక సదుపాయాలు, సాంకేతికత రంగాల్లో కొత్త అవకాశాలను అన్వేషించే దిశగా కట్టుబడి ఉన్నట్లు వెల్లడిస్తూ ఈ సదస్సు ముగిసింది.

ప్రభుత్వం ఆదుకోకుంటే క్రాప్ హాలిడేనే..

పంటపొలాలపై పదేపదే ఏనుగుల దాడి.. ఆందోళనలో రైతులు

ఏనుగులు తొక్కి నాశనంచేసిన చిరుపొట్ట దశలో ఉన్న వరి పైరు

ప్రజాశక్తి - చిన్నగొట్టిగల్లు: ఏనుగులు తరచూ పంటలపై పడి తీవ్రంగా నష్ట పరుస్తుండడం, ప్రభుత్వం వైపు నుంచి శాశ్వత పరిష్కారం రాకపోవడం, ఇక రావన్న నమ్మకంతో పంటలు పెట్టడం మళ్లీ ఏనుగులు గుంపు పడి తీవ్రంగా నష్టపరుస్తుండడంతో ఇలా ఎన్నాళ్ళు నష్టాలు బరించాలని, దీనికంటే క్రాప్ హాలిడే ప్రకటించి ప్రత్యామ్నాయ మార్గాలు వెతుక్కోవడం ఉత్తమమని బాదిత రైతులు పేర్కొన్నారు. మంగళవారం రాత్రి స్థానిక అరికెలవారిపల్లికి చెందిన రైతులు ద్వారకనాదరెడ్డి, సురేంద్రరెడ్డిల చిరుపొట్ట దశలో వున్న వరి పంటను ఏనుగుల గుంపు తొక్కగా నాశనమైన పంటను చూసి లబోదిబోమన్నారు. లక్షలాదిరూపాల పెట్టుబడులు పెట్టి, ఆరుగాలం శ్రమించి, ఎన్నోఆశలు పెట్టుకొని చేసిన పంటలను తరుచూ ఏనుగుల దాడికి నాశనమౌతుంటే రైతులు ఆవేదన చెందుతున్నారు. పంట రుచిమరిగిన ఏనుగులు అడవుల్లో వుండడంలేదు. ఎప్పుడు పంటలపై దాడిచేస్తాయో, ఎప్పుడు గ్రామాలపై దాడి చేస్తాయోనని ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం శాశ్వత పరిష్కారం చూపకపోతే క్రాప్ హాలిడే ప్రకటించడమే మేలని భావిస్తున్నారు. ప్రభుత్వం శాశ్వత పరిష్కారం చూపాలని, పంట నష్ట పరిహారం ఇచ్చి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

తిరుమలలో అన్నమయ్య ఇంటిని నిర్మించాలి

టిటిడి అధికారులకు వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: తిరుమలలో కూల్చివేసిన అన్నమయ్య ఇంటిని తిరిగి నిర్మించాలని, విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కోరుతూ టిటిడి పరిపాలన భవనం వద్ద జరిగిన అన్నమయ్య 522 వర్ధంతి సందర్భంగా అన్నమయ్య కళాక్షేత్రం పీఠాధిపతి విజయశంకర స్వామి డిమాండ్ చేశారు.అన్నమయ్య కళాక్షేత్రం, హిందూస్ ఫర్ ప్లూరాలిటీ అండ్ ఈక్వాలిటీ సంయుక్తాధ్వర్యంలో 'అన్నమయ్య 522 వ వర్ధంతి సందర్భంగా టిటిడి పరిపాలనా భవనం ఎదురుగా 'హైందవ భక్తి కళా సమ్మేళనం' జరిగింది. అన్నమయ్య చిత్రపటానికి పూలమాలలు అలంకరించి నివాళులర్పించారు. అనంతరం టిటిడి జెఈవో వీరబ్రహ్మంని కలిసి, తిరుమల కొండపై కూల్చేసిన అన్నమయ్య గృహాన్ని పునర్నిర్మాణం చేయాలని కోరగా ఆయన సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో అన్నమయ్య కళాక్షేత్ర అధికార ప్రతినిధి బాలసుబ్రమణ్యం, ఉమ్మడి చిత్తూరు జిల్లా జైభారత్ నాయకులు ఖదిజ్ఞాసి మహేష్, ఖదిజ్ఞాసి రజనీ, ఖదిజ్ఞాసి నారాయణ, జానపద కళా గురువులు, కళాకారులు పాల్గొన్నారు.

దళితులపై దాడి చేసిన వారిపై

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలి : సిపిఎం

తిరుచానూరు సీఐకి వినతి పత్రం సమర్పిస్తున్న సిపిఎం, సిఐటియు నేతలు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్ : తిరుపతి రూరల్ మండలం, తిరుచానూరు గ్రామ లెక్క దాకల సర్వే నెంబర్ 398/12లో 0.05 సెంట్లు దళితుల భూమిని కొందరు అధికార పార్టీకి చెందిన స్థానిక నాయకులు దళితులపై రాడ్లతో దాడి చేసి రక్తం వచ్చేలా కొట్టి ఆ భూమిలో నిర్మాణం చేపడుతున్నారు. దళితులపై దాడి చేసిన వారిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని బుధవారం సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో తిరుచానూరు పోలీస్ స్టేషన్ ముందు ధర్నా చేసి సిఐకి మెమరాండం సమర్పించారు. ఈసందర్భంగా సి.పి.ఎం జిల్లా కమిటీ సభ్యులు ఎస్ జయచంద్ర, రూరల్ కార్యదర్శి కె.సుమన్‌కలు మాట్లాడుతూ అ భూమిపై కోర్టు కేసు వుందన్నారు. అయినప్పటికీ ఇరు వర్గాల మధ్య ఘర్షణ జరిగిందన్నారు. కొంతమంది అగ్రకులాల వారు అ ప్రాంతంలో వున్న దళితులపై దాడి చేయడం దారుణమైన విషయమన్నారు. సిఐ స్పందిస్తూ కేసు నమోదు చేశామని, దాడి చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, ఇరు పార్టీలు భూమిలోకి ప్రవేశించకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సి.పి.ఎం నాయకులు యుగంధర్, దళితులు తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ కార్యకర్త శ్రీవాణికి ఘన నివాళి

అగన్వాడి కార్యకర్త శ్రీవాణికి నివాళి అర్పిస్తున్న సిఐటియు నాయకులు, అంగన్వాడీ సిబ్బంది

ప్రజాశక్తి - సత్యవేడు: తిరుపతి జిల్లా సత్యవేడు ఐసిడిఎస్ కార్యాలయంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు మెలుగు రమేష్ ఆధ్వర్యంలో అంగన్వాడి సిబ్బంది, యూనియన్ కార్యకర్తలు పిచ్చాటూరులో అంగన్వాడి కార్యకర్త శ్రీవాణి చిత్రపటం వద్ద నివాళి అర్పించారు. అనంతరం సిఐటియు నాయకులు మాట్లాడుతూ అంగన్వాడి కార్యకర్తగా పనిచేస్తూ విశేష కృషిచేసిన శ్రీవాణి మరణం తీరని లోటని తెలిపారు. సత్యవేడు అంగన్వాడి యూనియన్ నాయకురాలు నిర్మల మాట్లాడుతూ వాణిశ్రీ సిఐటియు యూనియన్‌గా పిచ్చాటూరు మండల సెక్టార్ లీడర్‌గా ప్రాజెక్ట్ నాయకురాలిగా అనేక పోరాటాలు చేశారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి వాడి కార్యకర్తలు కాంతమ్మ , భారతి, అనురాధ, భువన, నాగరాజు మంజుల, చందామరి, మంజుల దీప, సువర్ణ, శాంతి, రాణి తదితరులు పాల్గొన్నారు.

పాస్టర్ మృతిపై విచారణ జరపండి

అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న పాస్టర్స్ అసోషియేషన్ నాయకులు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: రాజమండ్రి ప్రాంతంలో సేవలు అందిస్తున్న పాస్టర్ ప్రవీణ్ కుమార్ పగడాల అనుమానాస్పద మృతిపై ప్రభుత్వం విచారణ జరపాలని పాస్టర్స్ అసోసియేషన్ నాయకులు డిమాండు చేశారు. శ్రీకాళహస్తి పాస్టర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రైస్తవులు ఏ మతానికి వ్యతిరేకం కాదన్నారు. కొంతమంది మతోన్మాదులు కక్షగట్టి క్రైస్తవుల మీద తరచూ దాడులు చేస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో అంబ్రోస్, సుందర్ రాజ్, జీవమణి, రవి డ్యానీ, జోసెఫ్, మణిబాబు,ఎలీషా, రఫాయిల్, భాస్కరరావు, ఆశీర్వాదం, పరమానందం, మోషే, కొండయ్య, నతనెల్, ఇమ్మానియేల్, లాజరస్, జాన్ పీటర్, రమేష్, రాజేంద్రన్, రాజన్న, జాకోబ్, విజయ్ కుమార్, ఏసుదాస్ తదితరులు పాల్గొన్నారు.

గంగ కాలువకు భద్రత కరువు

■ పారని నీరు ■ తొలగని ముళ్ల పొదలు ■ కానరాని అధికారులు

ప్రజాశక్తి- బుచ్చినాయుడు కండ్రిగః సత్యవేడు నియోజకవర్గ ఎరిసర ప్రాంతాల్లో ఉన్న తెలుగు గంగ కాలువ భద్రత గాలి కొదిలేయడంతో పూర్తిగా దుస్థితికి చేరింది. గత ఐదేళ్లుగా ఈ కాలువపై ప్రత్యేక పర్యవేక్షణ లేకపోవడంతో ఈ సమస్య ఏర్పడింది. ప్రధానంగా మన రాష్ట్రానికి సాగునీరు పక్క రాష్ట్రం తమిళనాడుకు తాగునీరు అందించే గంగ కాలువలు అధ్వానంగా మారాయి. ఈ కాలువలకు ఇరువైపులా ముళ్ల చెట్లు ఏపుగా పెరిగి పోయాయి. కాలువ అక్కడక్కడా చిట్టడవిని తలపిస్తోంది. బుచ్చినాయుడుకండ్రిక మండలం నుంచి సత్యవేడు సరిహద్దు వరకు కాలువలు పూర్తిగా అధ్వానంగా మారి దుస్థితికి చేరుకున్నాయి. అక్కడక్కడా బ్రాంచి కెనాల్ పనులు కూడా ఆగి పోయాయి. రాచపాలెం నుంచి సత్యవేడు సరిహద్దు వరకు కాలువ వెంబడి వేసిన రోడ్లు కూడా దుస్థితికి చేరాయి. కాలువల్లో పూడిక మట్టి ఎక్కువగా పేరుకు పోవడంతో నీటి ప్రవాహానికి ఇబ్బందులు తప్పడం లేదు. ఐదేళ్లుగా అధికారులు కాలువల పర్యవేక్షణ, నిర్వహణను పూర్తిగా విస్మరించారు. దీంతో సమీప రైతులకు సాగునీటి కష్టాలు తప్పడం లేదు.

గత ప్రభుత్వ హయాంలోనే మెరుగు..

గంగ కాలువలను గత ప్రభుత్వ హయాంలో ఏడాదికి ఒక ఒకసారి శుభ్రం చేస్తూ వచ్చేవారు. ఉపాధి హామీ కింద కూలీలతో కాలువకు ఇరువైపులా ఉన్న ముళ్ల చెట్లను తొలగించేవారు. ప్రస్తుతం పరిస్థితి అధ్వానంగా మారిపోయింది. ఇప్పటికిప్పుడు తమిళనాడుకు తాగు నీరును అందించాలన్నా కాలువలు ఆధ్వానంగా ఉండటం వల్ల నీటి ప్రవాహం పెద్దగా ఉండదు. అందువల్ల ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలుగంగ కాలువలను శుభ్రం చేయడంతో పాటు సమీప రైతులకు సాగునీరు అందించడానికి ఏర్పడ్డ అడ్డంకులను తొలగించాలని సత్యవేడు నియోజకవర్గ ప్రజలు కోరుతున్నారు. ప్రస్తుతం తెలుగు గంగ అధికారుల పనితీరు జీతాలు తీసుకోవడానికి మాత్రమే పరిమితమైంది. కాలువల పర్యవేక్షణ, సమీపంలో నిల్వ ఉంచిన మట్టి నిల్వల భద్రత పూర్తిగా గాలి కొది లేశారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా బుచ్చి నాయుడు కండ్రిగ మండలంలోని ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లే దారిలో తెలుగు గంగ పాత భవనాలు ఉండడం అందరికీ విదితమే. ఆ భవనాలకు ఇరువైపులా సాంఘిక సంక్షేమ బాలురు వసతిగృహం, బీసీ సంక్షేమ బాలుర వసతి గృహాలు వున్నాయి. శిథిలావస్థలో ఉండడంతో ఆ భవనాల నుండి పాములు సంచరిస్తుండటం ఆందోళనకు గురి చేస్తోంది. దీంతో ఆ మార్గంలో ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లే అధికారులు భయాందోళన చెందుతున్నారు. శ్రీ సిటీ, అపాచీ కంపెనీలకు అదే దారిన కాలినడకన వెళ్లే కార్మికులు రాత్రి సమయంలో వేసే షిఫ్టుల డ్యూటీలకు వెళ్లేవారు సైతం విష సర్పాల బెడదతో భయాందోళనకు గురవుతున్నారు. ప్రస్తుత ప్రభుత్వం పురాతన భవనాలను పరిశీలించి వాటిని జెసిపితో తీసివేసి శుభ్రపరచాలని స్థానికులు కోరుతున్నారు. ఆ భవనాలు చాలా కాలంగా నిరుపయోగంగా వున్నందువల్ల కూలే స్థితిలో వున్నాయని తగిన చర్యలు తీసుకోవాలని, సర్పాల బెడదను నివారించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికే మొదటి ప్రాధాన్యత : బొజ్జల

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: ప్రజా సమస్యల పరిష్కారానికే మొదటి ప్రాధాన్యనిస్తామని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకటసుధీర్ రెడ్డి చెప్పారు. శ్రీకాళహస్తి పట్టణంలోని పంచాయతీరాజ్ అతిథి గృహంలో బుధవారం ఆయన ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు ప్రతి నియోజకవర్గంలో శాసనసభ్యులు ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్నారన్నారు. ఇందులో భాగంగా తాను కూడా శ్రీకాళహస్తిలో ఈ కార్యక్రమం చేపట్టినట్లు ఆయన చెప్పారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత ప్రజల వద్దకు పాలన తీసుకెళుతోందన్నారు. ప్రజల నుంచి వచ్చిన వినతులు పరిశీలించి వీలైనంత త్వరగా ఆ సమస్యలు పరిష్కరిస్తామన్నారు. వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వేసవిలో నీటి ఎద్దడి రాకుండా చర్యలు చేపట్టండి : మేయర్, కమిషనర్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: మేయర్ డాక్టర్ శిరీష బుధవారం ఇంజనీరింగ్ అధికారులతో తాగునీటి సమస్యపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఒకపక్క అవిశ్వాస తీర్మానానికి కూటమి నేతలు సిద్ధమవుతున్న వేళ డాక్టర్ శిరీష తాగునీటిపై కార్పొరేషన్ కార్యాలయంలో సమీక్ష నిర్వహించడం ప్రాధాన్యతను సంతరించుకుంది. ఉగాది తర్వాత మేయర్‌పై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టాలని కూటమి నేతలు నిర్ణయించిన విషయం తెలిసిందే. వేసవి కాలంలో నగర ప్రజలకు త్రాగునీటి ఎద్దడి రాకుండా, ఎండ నుండి ఉపశమనం కలిగేలా తగు చర్యలు చేపట్టాలని నగరపాలక సంస్థ మేయర్ డాక్టర్ శిరీష, కమిషనర్ మౌర్య సమీక్ష సమావేశంలో అధికారులను ఆదేశించారు. వీధకుక్కల నియంత్రణకు చర్యలు చేపట్టాలని, చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని, పారిశుధ్య కార్మికులకు ఎండ నుండి ఉపశమనం ఏర్పాట్లు చేయాలని సూచించారు. డ్రైనేజీలు ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్లు తులసి కుమార్, గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, రెవెన్యూ అధికారులు సేతు మాధవ్, రవి, డీసీపీ మహాపాత్ర, వెటర్నరీ ఆఫీసర్ డాక్టర్ నాగేంద్ర, హార్టికల్చర్ ఆఫీసర్ హరికృష్ణ, మేనేజర్ హసీమ్, డి.ఈ.లు, తదితరులు ఉన్నారు.

హోమ్ కంపోస్టింగ్‌పై అవగాహన కల్పించండి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: ఇంటి నుండి ఉత్పత్తి అయ్యే చెత్తతో ఎరువు తయారు చేసుకుని, మొక్కలకు వినియోగించుకునే విధానంపై ప్రజల్లో ఆవాహన పెంచాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. బుధవారం ఉదయం నగరంలో ఖాదీ కాలని, రైల్వే స్టేషన్, ఆటో నగర్ తదితర ప్రాంతాల్లో హెల్త్, ఇంజినీరింగ్, ప్లానింగ్ అధికారులతో కలసి కమిషనర్ పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ వెంట అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, సూపరింటెండెంట్ ఇంజనీర్ శ్యాంసుందర్, మున్సిపల్ ఇంజనీర్ గోమతి, డి.ఈ లు రమణ, మధు, ఏసిపి లు బాలాజీ, మూర్తి, సర్వేయర్ కోటేశ్వర రావు, తదితరులు ఉన్నారు.

కొనసాగుతున్న న్యాయవాదుల ధర్నా

న్యాయవాదులు విధులు బహిష్కరించి నిరసన చేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : హైదరాబాదు న్యాయవాది ఇజ్రాయిల్‌పై దాడికి నిరసనగా పుత్తూరు బార్ అసోసియేషన్ న్యాయవాదులు రెండో రోజు బుధవారం విధులను బహిష్కరించి కోర్టు ఆవరణలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షులు పురుషోత్తం, కార్యదర్శి మురళి రెడ్డి మాట్లాడుతూ న్యాయవాదులపై దాడులు చేయడం అమానుషమన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ నాయకులు శేషాచలం, ఎం.సంజీవి, నరేంద్ర కుమార్, గాలి రమేష్, రాజేష్, గాలి సురేష్, కేజీ ప్రభాకర్, విజయ్ కుమార్. కె చంద్రశేఖర్, న్యాయవాదులు పాల్గొన్నారు.

28న ఎస్.కె.ఆర్‌లో జాబ్ మేళా

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు, ఎస్. కె.ఆర్ డిగ్రీ కలశాలలో ఈనెల 28న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ఎస్.కె.ఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శివ ప్రసాద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శ్రీ సిటిలోని ప్రముఖ టూత్ బ్రష్ కంపెనీ బ్లు ఓషన్ పర్సనల్ అండ్ అలీడ్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ఆధ్వర్యంలో నేస్తం ఫౌండేషన్ ద్వారా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

భారతీయ అంబేద్కర్ సేన రాష్ట్ర అధికార ప్రతినిధిగా ఉమాపతి

నియామకపు ఉత్తర్వు అందుకుంటున్న ఉమాపతి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): భారతీయ అంబేద్కర్ సేన రాష్ట్ర అధికార ప్రతినిధిగా మంగళం, రణధీరపురం గ్రామపంచాయతీ ఉపసర్పంచి మల్లెమొగ్గల ఉమాపతి ఎంపికయ్యారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రైవేటు హోటల్లో 46 మందితో రాష్ట్ర నూతన కమిటీని భారతీయ అంబేద్కర్ సేన వ్యవస్థాపకులు పిటిఎం శివ ప్రసాద్ ఆధ్వర్యంలో బాస్ కేంద్ర కమిటీ ప్రతినిధులు దుర్గం సుబ్బారావు, కె.వి రమణ పర్యవేక్షణలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మల్లెమొగ్గల ఉమాపతి మాట్లాడుతూ రాష్ట్ర నూతన కమిటీలో నన్ను రాష్ట్ర అధికార ప్రతినిధిగా ఏకగ్రీవంగా ఎన్నిక చేసిన బాస్ వ్యవస్థాపకులు పిటిఎం శివప్రసాద్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

విలేజ్ హెల్త్ క్లినిక్ పరిశీలన

ప్రజాశక్తి - ఓజిలి : మండల పరిధిలోని చిలమానుచేను, ఆర్మేనిపాడు, విలేజ్ హెల్త్ క్లినిక్ సెంటర్‌ను తిరుపతి జిల్లా టాస్క్ ఫోర్స్ సభ్యులు శ్రీనివాసులు బుధవారం పరిశీలించారు. గ్రామంలోని గర్భవతులుకు వైద్య పరీక్షల నిర్వహించి, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల అమలు పరుస్తున్న పథకాలను వివరించారు. వేసవి కాలంలో వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, కిషోర బాలికలు, గర్భవతులు, బాలింతలకు ఆరోగ్య సలహాలను అందించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు మాధవ్, వినీషా, హెల్త్ అసిస్టెంట్లు ప్రభాకర్, కన్నా వెంకట రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

మూడో రోజు కొనసాగిన రిలే దీక్షలు

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: తిరుపతి ఎస్పీడీసీఎల్ కార్యాలయం ఎదుట ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో చేస్తున్న రిలే నిరాహార దీక్ష బుధవారం మూడవ రోజుకు చేరుకుంది. బుధవారం దీక్షను యూనియన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు దుగ్గిరాల సూరిబాబు, ఎస్పీడీసీఎల్ కమిటీ ప్రధాన కార్యదర్శి బొజ్జ సుమన్ , తిరుపతి జిల్లా ప్రధాన కార్యదర్శి కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సూరిబాబు మాట్లాడుతూ విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల సమస్యల పరిష్కారంకోసం యునైటెడ్ ఎలక్ట్రిసిటి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నాకు వివిధ ప్రాంతాల నుండి వచ్చిన వారికి ధన్యవాదాలు తెలిపారు. విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న కార్మికులందరిని రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు జిల్లా కోశాధికారి పెంచల ప్రసాద్, గోగుల మహేష్, జిల్లా నాయకులు సుబ్రమణ్యం, అసిఫ్, రాజశేఖర్, సునీల్, విజయ్ కుమార్, వేణు, మధు, లోకేష్, మనోజ్, హరినారాయన, నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

అమెజాన్ సేవలు మరింత విస్తృతం

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : అమెజాన్ సేవలు మరింత విస్తృతమెనట్లు అమెజాన్ ప్రెస్ ఇండియా డైరెక్టర్ శ్రీకాంత్ శ్రీ రామ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన బుధవారం విలేకరు లతో మాట్లాడుతూ పూర్తి-బాస్కెట్ కిరాణా సరుకుల సేవలు ఇప్పుడు దేశవ్యాప్తంగా 170 నగరాల్లో విస్తరించిం దన్నారు. అమేజాన్ ఫ్రెష్ పండ్లు, కూరగాయలు, పాలు, బ్రెడ్, ఫ్రోజెన్ ఉత్పత్తులు, సౌందర్య వస్తువులు, బేబీ కేర్ అవసరాలు, వ్యక్తిగత సంరక్షణ ఉత్పత్తులు, పెట్ సరఫరాలు సహా వెట్, డ్రై కిరాణా సరుకుల విస్తృత శ్రేణిని అందిస్తోందని తెలిపారు. తాజాదనం, నాణ్యతను నిర్ధారించడానికి, అమేజాన్ ఫ్రెష్ విక్రేతలు పండ్లు, కూరగాయలను 11,000 మంది రైతుల నుండి సేకరిస్తారని తెలిపారు. ఈ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పగడాల ప్రవీణ్ మృతిపై విచారణ జరపాలి

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : తెలంగాణకు చెందిన అంతర్జాతీయ వర్తమానికులు పగడాల ప్రవీణ్ మృతిపై పూర్తి విచారణ జరపాలని ఏపీ బిసప్ కౌన్సిల్ చైర్మన్ ఎలమంచిలి ప్రవీణ్ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన విలేకరు లతో మాటాడుతూ హైదరాబాద్ వాస్తవ్యులు ఒక దైవ సేవకులు, డిబేటర్, యూట్యూబర్, అంత ర్జాతీయ వర్తమానికులు, క్రైస్తవ నాయకుడు ఆయన పగడాల ప్రవీణ్ హైదరాబాద్ నుండి రాజమండ్రి ప్రయాణం చేస్తూ తూర్పుగోదావరి జిల్లా రాజానగరం మండలం, దివాన్ చెరువు పెట్రోల్ బంక్ దగ్గర అనుమానాస్పద పరిస్థితుల్లో చనిపోయి పడి ఉండడం ఒక సంచలనం అన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి దీనిపై తగు లోతైన విచారణ జరపవలసిందిగా, ఈ క్రైస్తవ సమాజానికి నిజా నిజాలు బయటికి తీయవలసిందిగా బిషప్ కౌన్సిల్ తరపున డిమాండ్ చేశారు.

ప్రజల నుండి వినతులు స్వీకరణ

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు, ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే సునీల్ కుమార్ గ్రీవెన్స్ డే నిర్వహించారు. పట్టణ, రూరల్ ప్రాంతాలకు చెందిన ప్రజలు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. కొన్ని సమస్యలను అధికారులతో ఎమ్మెల్యే మాట్లాడి అప్పటికప్పుడే పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యమా.. ఎక్కడ నీ చిరునామా..?

ఒక వైపు ప్రభుత్వాధికారులు ప్రతి నెలలా మూడవ శనివారం 'స్వర్ణాంధ్ర.. స్వచ్ఛాంధ్ర' అంటూ ఊదరగొట్టి.. నామమాత్రంగా ఫోటోలకు ఫోజులిచ్చి చేతులు దులుపుకుంటున్నారు. వెంకటగిరి మున్సిపాలిటీ నగరం నడిబొడ్డున ఆర్‌టిసి బస్టాండు వెనుక పారిశుద్ధ్యం చూస్తే పారిశుధ్య నిర్వహణపై వారికి ఉన్న శ్రద్ధ తేటతెల్లమవుతుంది. ఇలాంటి పరిసరాల్లో 20 గిరిజన కుటుంబాల వారు నివసిస్తున్నారు. పందులు, దోమల స్వైర విహారంతో చిన్నారులు, వృద్ధులు అనారోగ్యం పాలవుతున్నా అధికారుల చర్యలు శూన్యం.. పారిశుద్ధ్యంపై ప్రజాశక్తి ఫోకస్.

- గిరిజనుల కష్టాలు ఎవరికీ పట్టవు
- పారిశుధ్య పనులు శూన్యం
- ఎన్నికలప్పుడే కనపడే నాయకులు
- కాలనీల్లో సమస్యల తిష్ట

ప్రజాశక్తి - వెంకటగిరి టౌన్: వెంకటగిరి మున్సిపాలిటీ పరిధి 11వ వార్డు ఆర్టీసీ బస్టాండ్‌కు దక్షిణం వైపున గిరిజనులు నివాసముంటున్న ఏరియాలో వీధులు అపరిశుభ్రమయమయ్యాయి. పారిశుధ్యం అస్తవ్యస్తంగా ఉంది. కుళ్లిపోయిన చెత్తలో పందులు స్వైర విహారం చేస్తున్నాయి. చెత్త దిబ్బల్లో నుంచి గిరిజన కాలనీలోకి విష కీటకాలు వస్తున్నాయి.మురికి కాలువల్లో నీరు నిలిచిపోతుండటంతో దోమల బెడద ఎక్కువైంది. మున్సిపల్ అధికారులు చెత్త శుభ్రతకు గానీ, దోమల నివారణకుగానీ ఎటువంటి చర్యలు చేపట్టడం లేదు. వార్డు అపరిశుభ్రత గురించి స్థానికులు ప్రజాశక్తి దృష్టికి తీసుకు వచ్చారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి పారిశుధ్యాన్ని మెరుగుపరచాలని, మురుగునీరు నిలవ లేకుండా చేయాలని కోరుతున్నారు.

నడిబొడ్డున ఉన్నా.. పట్టించుకునేవారు ఎవరు..?

వెంకటగిరి టౌన్‌కి నడిబొడ్డున ఆర్టీసీ బస్టాండు పక్కనే 20 పైగానే గిరిజన కుటుంబాలు నివాసాలు ఉంటున్నారు. గత ఐదేళ్ల నుంచి వారిని పట్టించుకునే వారే కరువయ్యారని గిరిజనులు వాపోయారు. ఎన్ని ప్రభుత్వాలు మారినా మా రాతలు మారడం లేదని మమ్మల్ని పట్టించుకునే వారే లేరని ఆవేదన వ్యక్తం చేశారు.

వీధి దీపాలు వెలగడం లేదు .. గత ఐదు సంవత్సరముల నుండి వీధి దీపాలు కూడా వెలగడం లేదు. అధికారంలో ఎవరు ఉన్నా మా గురించి పట్టించుకునే వారే లేరు. వీధి దీపాలు లేక చీకటి పడితే పిల్లలు, వృద్ధులు ఇబ్బది పడుతున్నారు.

\- కంచర్ల మాధవి

విష కీటకాల బెడద .. రాత్రి సమయాలలో విష కీటకాల బెడద ఎక్కువగా ఉంది. ఇంటి నుండి అవసరాల కోసం బయటకు రావాలంటే ఎక్కడ విష కీటకాలు కాటేస్తాయో అనే భయంతో బిక్కుబిక్కుమంటూ ఉన్నారు.

నీటి సమస్య .. చివరకు తాగునీరు కూడా కాలనీ వాసులకి సక్రమంగా అందడం లేదు. వారు నివాసాలు ఉంటున్న కాలనీకి తాగునీరు సరఫరా చేయాలని గిరిజనులు కోరుతున్నారు.

మున్సిపాలిటీ వారు పట్టించుకోరు.. పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా ఉన్నా, దోమల బెడద తీవ్రంగా ఉన్నా, పందులు స్వైర విహారం చేస్తూన్నా, వీధి దీపాలు వెలగకపోయినా, విష సర్పాల బెడద ఎక్కువగా ఉన్నా మున్సిపల్ అధికారులకు చామ కుట్టినట్లు కూడా లేదు. ఇప్పటికైనా మా గిరిజనుల సమస్యలను పట్టించుకుని మాకు న్యాయం చేయాలని మమ్మల్ని ఆదుకోవాలని ప్రజాశక్తితో మొరపెట్టుకున్నారు.

శానిటరీ ఇన్స్పెక్టర్ రామారావు వివరణ

గిరిజన కాలనీలో పారిశుధ్యం అస్తవ్యస్తంగా ఉంది. చెత్త దిబ్బల్లో నుండి పాములు గిరిజన కాలనీలోకి వస్తున్నాయి వాటి గురించి ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రజాశక్తి వివరణ కోరగా, కమిషనర్ దృష్టికి తీసుకెళ్లండి. కమిషనర్ నాకు చెపితే చేయిస్తాను అని దాట వేసే పద్ధతులో సమాధానం చెప్పారు.

ఎక్సైజ్ శాఖ అధికారుల ప్రోత్సాహంతోనే మద్యం దుకాణం నిర్మితం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : చిత్తూరు – పుత్తూరు జాతియ రహదారిలో ఆంజనేయస్వామి దేవాలయం సమీపంలో మద్యం దుకాణం తెరిచే ప్రయత్నాలు చేస్తున్నారని స్థానిక ప్రజలు ఆందోళన చెందారు. అక్కడే ఓ పక్క లైబ్రరీ, మరో పక్క చిల్డ్రన్స్ హాస్పిటల్, పాఠశాలలు సినిమా హల్, 100 మీటర్ దూరంలో ద్రౌపతమ్మ తిరునాళ్ల జరిగే మంచినీళ్ల గుంట, మున్సిపాలిటీ పార్క్ ఉన్నాయాని, నిత్యం రద్దీగా ఉండే ప్రాంతంలో మద్యం దుకాణం ఏర్పాటు చేయనున్నారని ప్రజలు అసహనం వ్యక్తం చేశారు. మద్యం దుకాణం ఏర్పాటు విరమించుకోవాలని అధికారలకు వినతి సమర్పించారు. దీంతో దుకాణ ఏర్పాటు బ్యానర్లను తొలగించారు. కానీ మంగళవారం అర్ధరాత్రిలో లైసెన్స్ కూడా లేని ఆ షాపుకు మద్యం దిగుమతి చేశారు. మద్యం దిగుమతిని స్థానిక ప్రజలు. అడ్డగించారు. తదుపరి పుత్తూరు పోలీస్‌లకు సమాచారం అందించారు. ఆస్టాకును సంబంధిత గౌడ్ మద్యం షాప్ యజమానులకు అప్పగించారు. మరలా బుధవారం ఉదయం 11 గంటల ప్రాంతంలో వద్దన్న చోటే మద్యం బాటిళ్లను ఆదే షాప్‌లో గౌడ్ వైన్స్ వారు దిగుమతి చేసే ప్రయత్నం చేశారు. దీంతో ప్రజలు తీవ్ర ఆవేశానికి గురై, మద్యం దిగుమతిని అడ్డగించి పుత్తూరు ఎక్సైజ్ శాఖ అధికారుల ప్రోత్సాహంతోనే ఇలాంటి పనులు జరుగుతున్నాయని మండిపడ్డారు. మద్యం దుకాణ ఏర్పాటు విరమించకపోతే నిరసనలు చేపడతామని స్థానికులు హెచ్చరించారు.

టీడీపీ నాయకుడు సోమశేఖర్ రెడ్డి మృతికి నివాళి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : వడమాలపేట మండలం, బాలినాయుడు కండ్రిగ పంచాయతీ, పిడతల కోన ఆయకట్టు చైర్మన్ టిడిపి సీనియర్ నాయకులు సోమశేఖర్ రెడ్డి అనారోగ్యంతో వేలూరు సీఎంసీలో చికిత్స పొందుతున్నారు. బుధవారం ఉదయం తుది శ్వాస విడిచారు. విషయం తెలుసుకున్న నగరి ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ సంతాపం తెలిపారు.

బస్సు సర్వీసులు ఏర్పాటు చేయండి

ప్రజాశక్తి - పిచ్చాటూరు: విద్యార్థులు, ప్రజల సౌకర్యార్థం 5 రూట్లలో ఆర్టీసీ బస్సు సర్వీసులు ప్రారంభించాలని బుధవారం సాయంత్రం తిరుపతి ఆర్టీసీ రీజినల్ మేనేజర్‌కు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం వినతి పత్రం సమర్పించారు. సత్యవేడు నుండి వయా సంతవేలూరు మీదుగా సూళ్లూరుపేట వరకు, పిచ్చాటూరు నుండి వయా ఎస్ ఎస్ బి పేట, హనుమంత పురం మీదుగా దాసు కుప్పం వరకు, తిరుమలకు డైరెక్ట్ ఎక్స్‌ప్రెస్ సర్వీసు, నాలుగవది ప్రతి రోజు రాత్రి 8 గంటలకు సత్యవేడు నుండి వరదయ్యపాలెం మీదుగా శ్రీకాళహస్తి వరకు ఆర్టీసీ సర్వీసులు ప్రారంభించాలని కోరారు. వేసవి సెలవల అనంతరం శ్రీకాళహస్తి నుండి దిగవ పుత్తూరు మీదుగా పిచ్చాటూరు వరకు సర్వీసు కోసం ఎమ్మెల్యే విన్నవించారు. సానుకూలంగా స్పందించిన ఆర్టీసీ రీజినల్ మేనేజర్ పరిశీలించి ఏర్పాటు చేస్తామన్నారు.

ఉపాధి హామీ కార్యాలయం పరిశీలన

ప్రజాశక్తి - సత్యవేడు: సత్యవేడు మండల కేంద్రంలోని జాతీ ఉపాధి హామీ పథకం కార్యాలయాన్ని తిరుపతి జిల్లా ఏపీడి సరిత పర్యవేక్షించి కొత్తగా నియమితులైన ఏపీఓ విజయ్ భాస్కర్ పనితీరును పరిశీలించారు. ఇటీవల ఏపీవోగా విధులు నిర్వహిస్తున్న కృష్ణయ్య బదిలీ కావడంతో, ఆ స్థానంలో విజయభాస్కర్ నియమితులయ్యారు.

వైద్య సిబ్బంది రోగుల పట్ల సానుభూతితో వ్యవహరించాలి

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి, సంక్షేమానికి ఎన్డీఏ కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. గత ప్రభుత్వంలో పేరుకు పోయిన ఉద్యోగుల బకాయిలు దాదాపు 25 వేల కోట్లు కూటమి ప్రభుత్వం 7,230 కోట్లు ఇప్పటికే చెల్లించిందని మిగిలిన బకాయిలను కూడా ఆర్థిక పరిస్థితి మెరుగుపడగానే చెల్లిస్తుందని ఆయన చెప్పారు. ప్రతి ఉద్యోగి ఆనందంగా ప్రశాంత వాతావరణంలో మరింత ఉత్సాహంగా ప్రజలకు సేవచేసేలా ప్రభుత్వం చూస్తుందని ఆయన తెలిపారు. ఉద్యోగుల సంక్షేమంలో భాగంగా ఏపి హంస అసోషియేషన్ కు మెడికల్ కాలేజి ఆవరణలో కేటాయించిన భవనాన్ని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు బుధవారం ఉదయం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏపి హంస ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షులు రాజ, సెక్రటరీ టాటా బాయి, కోశాధికారి ఇమ్రాన్, తిరుపతి సిటీ అధ్యక్షులు సురేంద్ర, సెక్రెటరీ ముని రాజా, ట్రెజరర్ శాంతకుమార్, కార్యవర్గ సభ్యులు, ఎన్డీఏ నాయకులు మహేష్ యాదవ్, రాజా రెడ్డి, హెచ్ డి ఎస్ సభ్యులు బండ్ల లక్ష్మీపతి, కెఎంకె లోకేష్, ఆర్యాట్ కృష్ణప్రసాద్, ఆముదాల వెంకటేష్, జానకిరామి రెడ్డి, ఉదయ్, ఆళ్వార్ మురళీ, శ్యామలాదేవి, హేమంత్ కుమార్ , రాజేష్ ఆచ్చారి తదితరులు పాల్గొన్నారు.

టీఎంఆర్ విద్యార్థులు నవోదయకు ఎంపిక

ప్రజాశక్తి - చిట్టమూరు: ఇటీవల జరిగిన జవహర్ నవోదయ విద్యాలయాల ప్రవేశపరీక్షలో 2025-26 విద్యా సంవత్సరానికి 6 వ తరగతిలో టి.ఎం.ఆర్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ కొత్తగుంటకు చెందిన ఐదవ తరగతి చదువుతున్న పవన్ జోషిత్, ఇషా దీక్షిత అను ఇద్దరు జవహర్ నవోదయ పాఠశాలలో ప్రవేశానికి అర్హత సాధించారని స్కూల్ కరస్పాండెంట్ మనోహర్ రెడ్డి తెలియజేశారు. కొత్తగుంట టిఎంఆర్ స్కూల్‌లో నవోదయ పరీక్షకు శిక్షణ ఇస్తున్నందున ఈ విజయం సాధ్యమైందని మనోహర్ రెడ్డి తెలిపారు. గత సంవత్సరం కూడా ఒక విద్యార్థి టిఎంఆర్ స్కూల్ నుంచి నవోదయ స్కూల్ నందు సీటు సాధించినట్లు తెలియజేశారు. సీట్లు సాధించిన విద్యార్థులను శిక్షణను ఇచ్చిన ఉపాధ్యాయులు బి.గోపాల్ ఈ రూబేష్, రవిలను అభినందించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ విజయలక్ష్మి ప్రిన్సిపల్ రాహంతుల్లా పాల్గొన్నారు.

జోన్ల వారీగా వీధి విక్రయదారులు వ్యాపారాలు చేసుకోవాలి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: నగరంలో వీధి విక్రయదారుల కొరకు కేటాయించిన జొన్లలో వ్యాపారాలు చేసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య సూచించారు. మెప్మా ఆధ్వర్యంలో నగరపాలక సంస్థ కార్యాలయంలో కమిషనర్ ఎన్.మౌర్య అధ్యక్షతన వీధి విక్రయదారుల టౌన్ వెండింగ్ కమిటీ సమావేశం బుధవారం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ తిరుపతిలో వెండింగ్ జోన్స్ అండ్ గ్రీన్ జోన్స్, అంబర్ జోన్స్, రెడ్ జోన్స్‌గా విభజించామని, కమిటీ మెంబర్స్ సమక్షంలో టౌన్ మ్యాప్ తయారు చేయడం జరిగిందన్నారు. ఈ సమావేశంలో అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్లు తులసి కుమార్, గోమతి, హెల్త్ ఆఫీసర్ యువ అన్వేష్, డీసీపీ మహా పాత్ర, స్టాండింగ్ కమిటీ మెంబర్ దినకర్, రెవెన్యూ అధికారులు సేతు మాధవ్, రవి, ట్రాఫిక్ డిఎస్పీ రామకృష్ణ, ఏసిపి బాలాజీ, మెప్మా సిఎంఎంలు కృష్ణవేణి, సోమకుమార్, గాయత్రి, వీధివిక్రయదారులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ముగిసిన పదవ తరగతి ఫిజికల్ సైన్స్ పరీక్ష

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : మండలంలో బుధవారం పదవ తరగతి ఫిజికల్ సైన్స్ పరీక్ష ప్రశాంతంగా ఎలాంటి అవాంతర సంఘటనలు లేకుండా జరిగిందని మండల విద్యాశాఖ అధికారి తిరుమలరాజు తెలిపారు. పరీక్షకు 1428 మంది హాజరయ్యారని, 8 మంది గైర్హాజరయ్యారని తెలిపారు.

బాలికల జూనియర్ కళాశాల స్థలం కాపాడండి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: తొట్టంబేడు మండల కేంద్రంలో ఉన్న ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల స్థలాన్ని కాపాడాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షులు జాకీర్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన బుధవారం శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల వెంకటసుధీర్ రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. కళాశాల స్థలం ఆక్రమణకు గురవుతోందన్నారు. దీంతో కళాశాల వారు పడుతున్న ఇబ్బందులను వివరించారు. ఆ స్థలం కబ్జాకు గురి కాకుండా ప్రహరీ నిర్మించాలని జాకీర్ కోరారు. ఇందుకు ఎమ్మెల్యే బొజ్జల వెంకటసుధీర్ రెడ్డి సానుకూలంగా స్పందించారు.

ప్రశాంతంగా భౌతిక శాస్త్ర పరీక్ష

ప్రజాశక్తి - తిరుపతి: పదోతరగతి భౌతిక శాస్త్రం పరీక్ష బుధవారం ప్రశాంతంగా జరిగాయని జిల్లా విద్యాశాఖ అధికారి కె వి ఎన్ కుమార్ పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా 164 పరీక్ష కేంద్రాలలో నిర్వహించిన ఈ పరీక్షకు రెగ్యులర్ 26902 మంది, ప్రవేటు 378 మంది విద్యార్థులు హాజరవ్వాల్సి ఉండగా రెగ్యులర్ 26646, ప్రవేటు 302 మంది మొత్తం 26948 హాజరయ్యారని తెలిపారు. రెగ్యులర్ 256 మంది, ప్రయివేటు 76 మంది పరీక్షకు గైర్హాజరయ్యారని తెలిపారు. అలాగే ఓపెన్ స్కూల్స్ పరీక్షకు సంబంధించి 1007 మందికి 864 మంది విద్యార్థులు హాజరుకాగా 143 మంది గైర్హాజరయ్యారన్నారు.

రైతుల బోర్లకు పరిష్కారం చూపండి

ప్రజాశక్తి -ఏర్పేడు: ఏర్పేడు నుండి వడమాలపేట వద్దనున్న పూడి వరకు నూతన రైల్వేలైనుకు సంబందించి ఏర్పేడు మండలంలోని ఎండి పుత్తూరు పంట పొలాల మీదగా ఏర్పడుతున్నందువలన రైతుల బోరులు, బావులు, వృక్షాలు మొదలగు వాటి గురించి బుధవారం అధికారులు సర్వే నిర్వహించారు. రైతులు వేసుకున్న బోర్లు సర్వే భాగంలో ఉన్నందున వారికి ప్రత్యామ్నాయం చూపాలని సర్పంచ్ మోహన ప్రియా కోరారు. సర్వే అధికారులు స్పందించి, ఉన్నతాధికారులకు తెలియపరుస్తామని తెలిపారు.

గేమ్స్ మీట్-2025 లో హోత్రిశ్రీ ప్రతిభ

ప్రజాశక్తి - రామచంద్రపురం (చంద్రగిరి) జేఎన్టీయూఏ అనంతపురం ఆధ్వర్యంలో జేఎన్టీయూ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్, కలికిరిలో జరిగిన ఇంటర్ ఇంజనీరింగ్ కాలేజీయేట్ గేమ్స్ మీట్ 2025లో చంద్రగిరి మండలంలోని కె.ఎం.ఎం ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థిని బ్యాట్మెంటన్‌లో హోత్రిశ్రీ ప్రతిభ చాటారు. ఆమెను విద్యార్థులు, కళాశాల యాజమాన్యం అభినందించారు.

జగన్‌ను కలసిన పఠాన్ ఫరీద్

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: వైసీపీ అధినేత జగన్మోహన్ రెడ్డిని బుధవారం తాడేపల్లెలో శ్రీకాళహస్తి నియోజకవర్గం వైసీపీ మైనార్టీ సెల్ అధ్యక్షులు పఠాన్ ఫరీద్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వైఎస్ జగన్‌కు కలంకారీ శాలువా కప్పి బొకే అందజేశారు. తనకు పదవి ఇచ్చినందుకు సంతోషంగా ఉందని, రానున్న ఎన్నికల్లో పార్టీ గెలుపుకు తనవంతు పాటు పడతానని పఠాన్ ఫరీద్ ఈ సందర్భంగా అన్నారు.

ఉగాది పచ్చడి పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : తిరుపతి సాహితీ సంస్థల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉగాది వేడుకల్లో భాగంగా బుధవారం తిరుపతి జిల్లా రచయితల సంఘం కార్యాలయంలో 'ఉగాది పచ్చడి' పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో శతావధాని ఆముదాల మురళి, సంస్థల ప్రతి నిధులు సాకం నాగరాజ, గార్లపాటి దామోదరం నాయుడు, ఎస్ జి డి చంద్ర శేఖర్, మన్నవ గంగాధర ప్రసాద్, తోటవెంకటేశ్వర్లు, తమటం రామచంద్రా రెడ్డి, డి. మస్తానమ్మ, ఏనుగు అంకమ నాయుడు, వి. జయరాం ప్రసాద్, పేరూరు బాలసుబ్రమణ్యం, పి.సాయిలక్ష్మి, పలువురు సాహితీ ప్రియులు పాల్గొన్నారు.

తిరుపతిలో ట్రాన్స్ ఫర్మేటివ్ ప్రాజెక్ట్ ప్రారంభం

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : టెట్రా ప్యాక్ సహకారంతో దళిత్ బహుజన్ రిసోర్స్ సెంటర్ (డిబిఆర్సి) ట్రాన్స్ ఫార్మేటివ్ ప్రాజెక్ట్‌ను తిరుపతిలో ప్రారంభించింది. వ్యర్థాలు ఏరుకునే ప్రజల ఉన్నతి లక్ష్యంగా ప్రారంభించబడిన ఒక కొత్త కార్యక్రమం ఇది. ఈ పనివారు నగర వ్యర్థాల నిర్వహణలో రీసైక్లింగ్ వ్యవస్థలో కీలకమైన బాధ్యతవహిస్తారు. కానీ తరచుగా ఆర్థికపరమైన సమస్యలు, సాంఘిక మినహాయింపులను ఎదుర్కొంటున్నారని పివిఆర్ సీఈవో కమలేష్ ఖోలియా, దేవ కుమార్, డిప్యూటీ డైరెక్టర్ శామ్యూల్ అనిల్ కుమార్ తెలిపారు. వారిలో చిన్న వయసు వారికి విద్యా బుద్ధులు నేర్పడం కూడా అ ప్రాజెక్టులో భాగమని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేషన్ అధికారులు, సిబ్బంది, ఆ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎస్వీబీసీ ఉద్యోగిని పరామర్శించిన సినీ నటుడు సుమన్

ప్రజాశక్తి - క్యాంపస్ : పూర్వ విద్యార్థుల సమ్మేళనానికి వచ్చి తిరిగి వెళుతూ, ప్రమాదంలో గాయాలై స్విమ్స్‌లో చికిత్స పొందుతున ఎస్వీబీసీ ఉద్యోగి గిరివర్ధన్‌బాబును, శ్రీవారి దర్శనార్థం వచ్చిన సినీ నటుడు సుమన్ పరామర్శించారు. సుమన్ వెంట బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పర్చూరు నారాయణ గౌడ్ తదితరులు ఉన్నారు.

శాస్త్రవేత్తలను ఆదర్శంగా తీసుకోండి

ప్రజాశక్తి - క్యాంపస్ : శాస్త్ర విజ్ఞానంతో ఎన్నో ఆవిష్కరణలతో సమాజ ఉన్నతి కోసం కృషి చేసిన శాస్త్రవేత్తలను ఆదర్శంగా తీసుకోవాలని వ్యక్తిత్వ వికాస నిపుణులు డీజీ రామ్మూర్తి కోరారు. ఎస్వీయూ ఫిజిక్స్ విభాగంలో బుధవారం నిర్వహించిన డి-కాంటినమ్ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో సైన్స్ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పద్మావతి, ఫిజిక్స్ విభాగాధిపతి ప్రొఫెసర్ బి. దేవప్రసాదరాజు, అధ్యాపకులు , విద్యార్థులు పాల్గొన్నారు.

క్రైం న్యూస్

10 ఎర్రచందనం దుంగలు స్వాధీనం

ఎర్రచందనం దుంగలను చూపుతున్న ఎఫ్ఆర్వో సుదర్శన్ రెడ్డి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం), ఏర్పేడు: శేషాచలం అటవీ ప్రాంతం నుండి అక్రమంగా తరలించకపోతున్న 10 ఎర్రచందనం దుంగలను అటవీ శాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. తిరుపతి ఎఫ్ఆర్ఓ సుదర్శన్ రెడ్డి తెలిపిన వివరాల మేరకు శ్రీ వెంకటేశ్వర నేషనల్ పార్క్ పరిధి కృష్ణాపురం సెక్షన్ పరిధిలోని పంగూరు రహదారి వద్ద బుధవారం తెల్లవారుజామున డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ సికిందర్ ఇతర సిబ్బందితో కలిసి వాహనాలు తనిఖీ చేపట్టారు. వెంకటగిరి నుండి ఏర్పేడు వైపు అతివేగంగా డస్టర్ కారు రావడానికి గమనించి దానిని ఆపే ప్రయత్నం చేయగా, వాహన చోదకుడు మరింత వేగంతో ఏర్పేడు వైపుగా వెళ్ళిపోయాడు. అతనిని వెంబడిస్తూ వెళ్లిన సిబ్బందికి దగ్గపేరి – నచ్చినేరీ హైవేపై వదిలి వెళ్లిన వాహనం కనబడింది. కారులో పరిశీలించగా 296 కేజీల బరువున్న ఐదు లక్షల విలువచేసే ఎర్రచందనం దుంగలు ఉన్నాయని ఎఫ్ఆర్ఓ తెలిపారు. కారును, ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకుని అటవీశాఖ కార్యాలయానికి తరలించామన్నారు. ఈ వాహన తనిఖీలలో కృష్ణాపురం, ఏర్పేడు ఎఫ్బిఓలు పురుషోత్తం, శోభారాణి, వాచర్స్ పొన్నయ్య, సుబ్రహ్మణ్యం, జితేంద్ర పాల్గొన్నారు.

ముక్కంటి హుండీ లెక్కింపులో మహిళ చేతివాటం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో బుధవారం జరిగిన హుండీ లెక్కింపులో తిరుపతికి చెందిన లావణ్య అనే మహిళ చేతివాటం ప్రదర్శించింది. నగదు లెక్కిస్తూ రూ.98,500 కాజేసింది. ఈమె బయటకు వెళ్లే సమయంలో ఆలయ భద్రతా సిబ్బంది తనిఖీ నిర్వహించగా నగదు కాజేసిన విషయం బయట పడింది. వివరాల్లోకి వెళితే చీరాలకు చెందిన భ్రమరాంబ సేవా సమితి ఆధ్వర్యంలో తిరుపతికి చెందిన లావణ్య శ్రీకాళహస్తీశ్వరస్వామి ఆలయంలో సేవలు అందిస్తోంది. భ్రమరాంబ సేవా సమితి సభ్యుల సేవలను కూడా హుండీ ఆదాయం లెక్కింపు విధుల్లో ఆలయం వినియోగించుకుంటున్నారు. ఇదే అదనుగా లావణ్య తన చేతివాటం ప్రదర్శించింది. అయితే భద్రతా సిబ్బంది నిఘాతో ఈమె దొరికి పోయింది. ఈ ఘటనపై ఆలయ అధికారులు వన్ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో లావణ్యను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నారు. గురుదక్షిణామూర్తి సన్నిధిలో నిఘా కెమెరాల నీడన కాకుండా పాత ఈవో కార్యాలయంలో హుండీ ఆదాయం లెక్కించడం వలన ఈ ఘటన చోటు చేసుకుందని భక్తులు అభిప్రాయపడుతున్నారు.

చీటింగ్ కేసులో నాయుడుపేటకు చెందిన ప్రముఖ వ్యక్తి అరెస్ట్

ప్రజాశక్తి - నాయుడుపేట: నాయుడుపేటలో ప్రముఖ మమతా హాస్పిటల్ అధినేత హరిప్రియ భర్త సత్యనారాయణ ను నాయుడుపేట పోలీసులు చీటింగ్ కేసులో అరెస్ట్ చేసినట్టు తెలియజేశారు. ఆయనపై నెల్లూరు పట్టణానికి చెందిన ప్రముఖ వైద్యరాలు తనని మోసం చేసి 60 లక్షల రూపాయలు తీసుకుని సమాధానం చెప్పడం లేదని ఫిర్యాదు చేయడంతో గవర్నమెంట్ డాక్టర్ అయిన డాక్టర్ హరిప్రియ భర్త సత్యనారాయణపై కేసు నమోదు చేసి నాయుడుపేట పోలీసులు అరెస్ట్ చేశారు. నెల్లూరు నగరంలో ప్రముఖ వైద్యురాలు డాక్టర్.బిందు మీనన్ నెల్లూరు అపోలో హాస్పిటల్‌లో న్యూరాలజిస్ట్‌గా పని చేస్తున్నారు. ఆమెకు నెల్లూరు నగరంలోనే సొంత హాస్పిటల్ కూడా ఉంది. డాక్టర్ హరిప్రియ నాయుడుపేట గవర్నమెంట్ హాస్పిటల్ సూపరింటెండెంట్‌గా విధులు నివర్తిస్తూ, నాయుడుపేటలోనే మమతా నర్సింగ్ హోమ్ పేరుతో ఒక ప్రైవేట్ హాస్పిటల్ నడుపుతున్నారు. నాయుడుపేట నుంచి గూడూరుకి బదిలీ అయినప్పటికీ, ఇక్కడ ప్రైవేట్ హాస్పిటల్ నిర్వహణ కోసం గూడూరు వైద్యశాలలో బాధ్యతలు చేపట్టకపోవడంతో గూడూరు గవర్నమెంట్ హాస్పిటల్‌లో మరొక డాక్టర్‌కు బాధ్యతలు అప్పగించారు. అప్పటి నుంచి డాక్టర్ హరిప్రియ నాయుడుపేటలోని ప్రైవేట్ హాస్పిటల్ నిర్వహణ చూసుకుంటోంది. ఆమె భర్త సత్యనారాయణ ఆమెతో హాస్పిటల్ నిర్వహణలో పలుపంచుకుంటూ, కొన్ని చిన్న చిన్న వ్యాపారాలు నిర్వహిస్తుంటాడు. డాక్టర్ హరిప్రియ భర్తగా ఎంతోమంది ప్రముఖులకు ఆమె ద్వారా సత్యనారాయణ పరిచయం ఉన్నాడు. బిందు మీనన్‌కు ఆయన డాక్టర్ హరి ప్రియ భర్తగా పరిచయం ఉన్నాడు. ఈ నేపథ్యంలో బిందు మీనన్ తన సొంత హాస్పిటల్‌కు సంబందించిన కొన్ని పరికరాలను అవసరం ఉండడంతో అంతకుముందు ఎప్పటినుంచో పరిచయం ఉన్నా సత్యనారాయణ ఢిల్లీలో తనకు తెలిసిన ఒక కంపెనీలో అతి తక్కువ రేటుకు ఆమెకు కావాల్సిన పరికరాలు ఇప్పిస్తానని నమ్మబలికి మూడు నాలుగు దపాలుగా ఆమె వద్ద నుంచి 60 లక్షల రూపాయలు తీసుకున్నాడని, ఆ తరువాత కనిపించకుండా కనుమరుగయ్యాడని ఎన్నిసార్లు ప్రయత్నించినా సమాధానం చెప్పలేదని ఆమె ఫిర్యాదు చేశారని సదరు సత్యనారాయణ నాయుడుపేటలో అదుపులో తీసుకొన్నామని కోర్టులో హాజరు పరుస్తామని నాయుడుపేట పట్టణ సీఐ బాబి తెలియజేశారు.

దళితులకు ఇంటి స్థలాలు మంజూరు చేయాలి

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: తిరుపతి జిల్లా, బుచ్చినాయుడు కండ్రిగ మండలం, కనమనంబేడురెవెన్యూ పరిధిలో గ్రామస్తులు తాసిల్దార్ కార్యాలయం ముందు15 రోజులుగా సిపిఐ జిల్లా కార్యదర్శి మురళి ఆధ్వర్యంలో నిరాహార దీక్ష చేస్తున్నారు. ఆయన మాట్లాడుతూ కనమనంబేడు దళితులకు ఇంటి స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కార్యదర్శి చిన్ని రాజా, మండల కార్యదర్శి కత్తి ధర్మయ్య, సిపిఐ నాయకులు, కనబడు దళితులు పాల్గొన్నారు

IN THE COURT OF THE CIVIL JUDGE (Senior Division), PUTTUR
A.S. No. 5/2015, O.S. No.15/2008

Between
Sri V. Subramanyam Died,
LRs. V. Sundaramma and others ....Appellants
And
S. Munaswamy died
LRs. S. Krishnavenamma and others
....Respondents

NOTICE TO RESPONDENTS 3,4,5 AND 6 BY PUBLICATION

To
1. USHA, W/o Ramana, D/o S. Munaswamy - R3
2. S. ANASUYA, W/o S. Murali, D/o S. Munaswamy - R4
3. SUJATHA, W/o Chandrasekhar, D/o S. Munaswamy - R5
4. SAI W/o Bhaskar, D/o S. Munaswamy -R6

All are residing at UjjinaiduKandriga Village, Narayanavanam Mandal, Tirupati District.
Madams,

Please take notice that the Appellants have filed the above appeal to set aside the Judgment and Decree in O.S. NO. 15/2008 on the file of the Prinicipal Junior Civil Judge Court, Puttur dated 19-01-2015 and the same is pending/ hearing on 01-04-2025 you are directed to appear on 01-04-2025 either in person or through Advocate. If you fail to appear on that day the matter will be decided exparte and next step will be ordered will be decided.
This is the order of this Hon'ble Court.

Advocate for Applets
V. UDHAYAKUMAR, B.Com, BL.,
ADVOCATE, D.N.10-112A, Dr. Rama Rao Colony PUTTUR-517583. Tirupati Dt. A.P.
Cell: 09000858936

గ్రామ పంచాయతీ కార్యాలయం, రేణిగుంట.

బహిరంగ వేలం ప్రకటన

రేణిగుంట గ్రామపంచాయతీ మరు వేల ప్రకటన ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయడమేమనగా రేణిగుంట గ్రామపంచాయతీకి సంబంధించిన 2025 – 2026 సంవత్సరమునకు బస్టాండు మరియు పోస్ట్ ఆఫీస్ ఎదురుగా ఉన్న నాలుగు రూములు అదేవిధంగా ఆర్టీసీ బస్టాండ్ ఎదురు కాగల వైకుంఠం కాంప్లెక్స్ ప్రక్కన 7 గదులు తేదీ 22-3-2025న జరిగిన వేలమునందు ఎవరు పాల్గొనలేదు. తిరిగి 29- 3-2025 శనివారం ఉదయం 10:30 గంటలకి గ్రామ పంచాయతీ ఆవరణములో బహిరంగ మరువేలము నిర్వహించబడును. కావున తెలియజేయడమైనది. ఆసక్తి కలవారు సంబంధించిన షెడ్యూల్ మేరకు ధరావత్తు డిడి రూపంలో చెల్లించి వేలమునందు పాల్గొనవచ్చును. మిగిలిన వివరములు కార్యాలయం పని వేళలో అడిగి తెలుసుకోవాలని తెలిపారు.

శ్రీ పి.యన్.మని
పంచాయితీ కార్యదర్శి
గ్రామపంచాయితీ,
రేణిగుంట.

శ్రీ ఆర్. నగేష్
సర్పంచ్
గ్రామపంచాయితీ,
రేణిగుంట.

అందరం కలిసికట్టుగా అభివృద్ధిని పరుగులు పెట్టిద్దాం

పార్టీ బలోపేతానికి కష్టపడ్డ ప్రతి కార్యకర్తకు గుర్తింపు : ప్రజాదర్బార్ కార్యక్రమంలో చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని

ప్రజాశక్తి రామచంద్రాపురం (చంద్రగిరి) చంద్రగిరి నియోజకవర్గంలో పార్టీలకు అతీతంగా అందరం కలిసికట్టుగా అభివృద్ధిని పరుగులు పెట్టిద్దామని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని పిలుపునిచ్చారు. తిరుపతి రూరల్ మండలం తనపల్లి రోడ్డు, రఘునాథ రిసార్ట్స్‌లోని టిడిపి పార్టీ కార్యాలయంలో బుధవారం ఎమ్మెల్యే నాని ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తిరుపతి రూరల్ మండలం పార్టీ అధ్యక్షుడు ఈశ్వర్ రెడ్డి అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని పాల్గొని పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ప్రారంభమైన ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాని మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీలో కష్టపడ్డ ప్రతి కార్యకర్తకు మంచి గుర్తింపు లభిస్తుందని చెప్పారు. వైసిపి నాయకుల వల్ల ఇబ్బందులు పడ్డ ప్రతి కార్యకర్తను కాపాడుకుంటానని అన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన ఎనిమిది నెలల్లో ఎక్కడా లేని విధంగా సుమారు 50 నుంచి 60 కోట్ల రూపాయలతో నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని వివరించారు. నియోజకవర్గంలోని ప్రతి గడప, ప్రతి ఓటరు తనకు సుపరిచితమే నని నాని తెలియజేశారు. ప్రతి గ్రామంలో 60 కుటుంబాలకు టిడిపి పార్టీ కుటుంబ సాధికారిక సభ్యులను ఏర్పాటు చేసి, అందులో మహిళా కార్యకర్తలకు ప్రాధాన్యం ఇస్తూ గ్రామాలను మరింత అభివృద్ధి చేద్దామన్నారు. గత వైసిపి పాలనలో స్థానిక ఎమ్మెల్యేగా పనిచేసిన చెవిరెడ్డి తన కుటుంబ సభ్యులకే కాంట్రాక్ట్ పనులను ఇచ్చి అక్రమార్జనకు పాల్పడ్డారని తెలిపారు. అయితే ప్రస్తుతం అభివృద్ధి పనులను కార్యకర్తలకే అప్పగించామని చెప్పారు. వైసీపీ పాలనలో వరదలలో కొట్టుకుపోయిన చెక్ డాంలను కూడా నిర్మించలేక పోయారని, కనీసం దెబ్బతిన్న రోడ్లకు తట్టెడు మట్టి కూడా వేయలేకపోయారని గుర్తు చేశారు. నియోజకవర్గంలో ప్రాధాన్యమైన పదవులను చెవిరెడ్డి, వారి కుటుంబ సభ్యులకే తీసుకుని ధనార్జనే ధ్యేయంగా అవినీతి, అక్రమాలకు పాల్పడ్డారని మండిపడ్డారు. చెవిరెడ్డి కుటుంబ సభ్యులు ఇసుక, గ్రావెల్ , ఇతర సహజ వనరులను పక్క రాష్ట్రాలకు అమ్ముకుని వందల కోట్ల రూపాయలు సంపాదించారని విమర్శించారు. రాష్ట్రం ఎంతో ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సహాయ సహకారంతో రాష్ట్రాన్ని అభివృద్ధి పదం వైపు పరుగులు పెట్టిస్తున్నారని తెలియజేశారు. రాష్ట్రానికి వివిధ రకాల పరిశ్రమలను తెప్పిస్తూ రాష్ట్రంలోని నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నారని పేర్కొన్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడు సి.ఆర్. రాజన్ మాట్లాడుతూ మీ బ్లూ మీడియా, నీ సొంత సోషల్ మీడియా ద్వారా నానిపై చేస్తున్న ఆధారాలు లేని అవినీతి ఆరోపణలను నిరూపించగలవా అంటూ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డికి సవాలు విసిరారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో, యువ నాయకుడు నారా లోకేష్‌తో నానికి ఉన్న చనువు వల్లే చంద్రగిరి నియోజకవర్గంలో అభివృద్ధి పరుగులు పెడుతుందన్నారు. కూటమి పార్టీల నాయకులకు, కార్యకర్తలకు సముచిత స్థానం ఇస్తున్నామన్నారు. దశల వారిగా అందరికీ అవకాశాలు వస్తాయని చెప్పారు. ఈ క్రమంలోనే రాష్ట్ర ఓబిసి సెల్ అధ్యక్షుడు బడి సుధా యాదవ్ గత ప్రభుత్వానికి ప్రస్తుత ప్రభుత్వానికి గల తేడాలను కూలంకషంగా వివరించారు. అన్ని మండలాల అధ్యక్షులు తమ తమ మండలాల్లో జరిగిన జరుగుతున్న అభివృద్ధి పనులను తెలియజేశారు. పాకాల జడ్పిటిసి నంగ పద్మజ రెడ్డి వైసీపీ పాలనలో ప్రజలు పడ్డ కష్టాలను సభాముఖంగా వివరించారు. ఈకార్యక్రమంలో చంద్రగిరి నియోజకవర్గం లోని అన్ని మండలాల క్లస్టర్ ఇన్చార్జిలు, నాయకులు, కార్యకర్తలు మహిళలు యువత పాల్గొన్నారు.

30న మహతిలో ఉగాది సంబరాలు

ప్రజాశక్తి - తిరుపతి: టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్, సంక్షేమ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో శ్రీ విశ్వావసు నామ సంవత్సర ఉగాది వేడుకలు మార్చి 30వ తేదీ తిరుపతిలోని మహతి కళాక్షేత్రంలో ఘనంగా జరుగనున్నాయి. ఇందులో భాగంగా ఉదయం 9.30 గంటలకు కార్యక్రమాలు ప్రారంభమవుతాయి. ఎస్వీ సంగీత, నృత్య కళాశాల ఆధ్వర్యంలో మంగళధ్వని, ఎస్వీ ఉన్నత వేదాధ్యయన సంస్థవారిచే వేదపారాయణం నిర్వహిస్తారు. ఈ సందర్భంగా ఉదయం 10 గంటలకు ప్రముఖ పండితులు పంచాంగ శ్రవణం చేస్తారు. అనంతరం అష్టావధానం, టీటీడీ ఉద్యోగుల పిల్లలతో "తెలుగు వైతాళికులు" వేషధారణ పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. అనంతరం ఉగాది పచ్చడి ప్రసాద వితరణ ఉంటుంది.

ఒంటిమిట్టలో రాములవారి కల్యాణానికి విస్తృత ఏర్పాట్లు

ప్రజాశక్తి - తిరుపతి : ఆంధ్రా భద్రాచలం ఒంటిమిట్ట శ్రీ కోదండ రామాలయం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు 2015, సెప్టెంబరు 9న టిటిడి ఆధీనంలోకి వచ్చింది. అప్పటి నుండి పురాతన చారిత్రక ప్రాశస్త్యం గల రామాలయంను ఆర్కియాలజి సర్వే ఆఫ్ ఇండియా అనుమతులు తీసుకుని ఆలయం లోపల, బయట టీటీడీ అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టింది. ఇందులో భాగంగా ప్రతి ఏడాది శ్రీ సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించేందుకు సుందరంగా కల్యాణ వేదిక, భక్తుల సౌకర్యార్థం షెడ్లు, మరుగుదొడ్లు, యాత్రీకుల వసతి సముదాయాలు నిర్మించారు. అదేవిధంగా ఆలయ లోపల పోటు, యాగశాల, పరిసరాల మరమ్మత్తులు, నూతన పుష్కరిణి, వాహన మండపం నిర్మాణం, మాడ వీధులలో సిసి రోడ్లు, డ్రైనేజి తదితర అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. భక్తులకు అహ్లాదకర ఆధ్యాత్మిక వాతావరణం కల్పించేందుకు పరిసరాలలో పచ్చదనం పెంపొందించారు. సీఎం ఆదేశాల మేరకు, టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో జె.శ్యామలరావు ఆధ్వర్యంలో, జెఈవో వి. వీరబ్రహ్మం పర్యవేక్షణలో ఏప్రిల్ 11న సాయంత్రం 6.30 నుండి రాత్రి 8.30 గంటల వరకు శ్రీ సీతారాముల కల్యాణాన్ని నిర్వహించేందుకు టీటీడీ విస్తృత ఏర్పాట్లు చేపట్టింది. కల్యాణానికి విచ్చేసే లక్షలాధి మంది భక్తులకు అవసరమైన తాగునీరు, అన్నప్రసాదాలు, భద్రాత, రవాణా, వైద్యం, పారిశుద్ధ్యం, పార్కింగ్ తదితర అంశాలపై టీటీడీ, జిల్లా యంత్రాంగంతో సమన్వయం చేసుకొని ఏర్పాట్లు చేస్తోంది.

అల్లా దయ ముస్లింలందరిపై మెండుగా ఉండాలి

ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : రాష్ట్ర ప్రభుత్వం ముస్లీం సోదరులకు ఇఫ్తార్ విందు ఇచ్చింది. స్థానిక ఆర్సీ రోడ్డులోని షాదిమహల్‌లో బుధవారం సాయంత్రం నమాజ్ అనంతరం ఇఫ్తార్ విందు జరిగింది. ఇఫ్తార్ విందును రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖ, వక్ఫ్ బోర్డ్ సంయుక్తంగా ముస్లింలకు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ముఖ్యఅథిదిగా పాల్గొని ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం రోజా విడిచాక ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొన్నారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ముస్లింలను అన్ని విధాలా ఆదుకుంటుందని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు చెప్పారు. ముస్లీం సోదరలకు రంజాన్ శుభాకాంక్షలు ఆయన తెలిపారు. ఏటా రంజాన్ మాసంలో ఉపవాస దీక్షతో అల్లాను ముస్లీంలు కొలవడం ఆనవాయితీగా వస్తోందని ఆయన చెప్పారు. అల్లా దయ ముస్లీంలందరిపై మెండుగా ఉండాలని కోరుకుంటున్నట్లు ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా మైనార్టీ వెల్ఫేర్ ఆఫీసర్ చిన్నారెడ్డి, డిఆర్ ఓ నరసింహులు, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ నరసింహ యాదవ్, డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, పులుగోరు మురళీ, దంపూరు భాస్కర్ యాదవ్, మహబూబ్ బాషా, ఎస్ కే బాబు, ఎస్ ఎండి రఫీ, రఫీ హిందూస్థానీ, నసిరుద్దీన్, షాబీర్, హర్షద్, సర్వరూద్దీన్, జమాల్, రాజా రెడ్డి, చిన్నబాబు, పుష్పావతి యాదవ్, మహేష్ యాదవ్, నైనార్ శ్రీనివాస్, కెఎంకే లోకేష్, జీవకోన సుధా, ఆముదాల వెంకటేష్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - క్యాంపస్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విశ్వ విద్యాలయాలు, డిగ్రీ కళాశాలలు, ఇతర ఉన్నత విద్యా సంస్థలలో పనిచేస్తున్న అధ్యాపకుల సమస్యలపైన ఏబిఆర్ఎస్ఎం రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ వైవి.రామిరెడ్డి న్యూఢిల్లీలో యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ ఛైర్మన్ ప్రొఫెసర్ మామిడాల జగదీష్ కుమార్‌ని కలిసి వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలలో దాదాపు 5 వేల అధ్యాపకుల ఖాళీలు ఉన్నాయని వీటిని వెంటనే భర్తీ చేసే విధంగా రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలని, రాష్ట్రంలో నూతనంగా నెలకొల్పిన విశ్వవిద్యాలయాలకు మౌలిక వసతులు, ప్రయోగశాల అభివృద్ధి కొరకు యూజీసీ నుంచి ప్రత్యేకమైన నిధులను విడుదల చేయాలని కోరారు.

విద్యార్థులే విశ్వవిద్యాలయానికి మూలస్తంభాలు

ప్రజాశక్తి - క్యాంపస్ : విద్యార్థులే విశ్వవిద్యాలయానికి మూల స్తంభాలుని ఎస్వీయూ ఇన్చార్జి విసి ఆచార్య సిహెచ్ అప్పారావు పేర్కొన్నారు. తిరుపతి, జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో బుధవారం ఛాత్రావాస వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ చీఫ్–వార్డెన్ డా.పరిమిత పండ, వార్డెన్స్ డా.డి.జ్యోతి, డా.కె.లీనాచంద్ర, డా.బుల్టీదాస్, పురుష ఛాత్రావాస వార్డెన్స్ డా.ప్రదీప్ కుమార్ బాగ్, డా.సోమనాథ్ దాస్, డా.జ్ఞాన రంజన పండ, డా.ఆర్.లక్ష్మీనారాయణ, డా.ఉదయన హెగ్డే, డా.ఆలోక్ మండల్, హాస్టల్ మేనేజర్ ఫణివర్మ, విశ్వవిద్యాలయంలోని హాస్టల్ సిబ్బంది, విభిన్న విభాగాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నీలకంఠేశ్వరస్వామి సేవలో జయేంద్ర సరస్వతి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: తొట్టంబేడు మండలం తంగేళ్లపాళెంలో వెలసిన నీలకంఠేశ్వరస్వామిని బుధవారం కంచి పీఠాధిపతి జయేంద్ర సరస్వతి దర్శించుకున్నారు. మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీనాయుడు ఈయనకు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం తంగేళ్లపాళెం వాసులు జయేంద్ర సరస్వతికి శాస్త్రోక్తంగా పాదపూజ చేశారు. జయేంద్ర సరస్వతి గ్రామస్తులను ఆశీర్వదించి తీర్థప్రసాదాలు ఇచ్చారు. నూతన ఆలయం నిర్మించడం కన్నా పురాతన ఆలయాన్ని జీర్ణోద్ధారణ చేసి నిర్వహణ చేయడం ఎంతో పుణ్యఫలమని ఈ సందర్భంగా జయేంద్ర సరస్వతి అభిప్రాయపడ్డారు.

ఘనంగా అన్నమయ్య వర్ధంతి ఉత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి - తిరుపతి: శ్రీమాన్ తాళ్లపాక అన్నమాచార్యుల 522వ వర్ధంతి మహోత్సవాలు టీటీడీ హిందూ ధార్మిక ప్రాజెక్టుల ఆధ్వర్యంలో అన్నమాచార్య కళామందిరంలో బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు ఆలపించిన సప్తగిరి సంకీర్తనల గోష్ఠిగానం ఆకట్టుకుంది.